సాక్షి అనకాపల్లి

శుక్రవారం ׀ 7 ׀ మార్చి ׀ 2025



శత శాతం ఉత్తీర్ణత లక్ష్యం

టెన్త్, ఇంటర్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యమని జీసీ, ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కె.రాజేశ్వరి తెలిపారు. 8లో



కూటమి నేతల బెదిరింపులు...

కుట్టు శిక్షణ ఉందని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఖాళీ చేయాలని కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారు... 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర	సహర్ శని
అనకాపల్లి	6.09	4.56
నర్సీపట్నం	6.12	4.54

న్యూస్‌రీల్

గురుకుల సీవోఈలో దరఖాస్తుకు గడుపు పెంపు

మధురవాడ: ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొమ్మాది రిక్షా కాలనీలోని విశాఖపట్నం డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ (సీవోఈ)లో 2025-26 విద్యా సంవత్సరం లో 5వ తరగతి, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం(ఇంగ్లీషు మీడియం)లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్టు ప్రిన్సిపాల్ శాంతికుమారి తెలిపారు. తొలుత మార్చి 6వరకు మాత్రమే అవకాశం ఉందని ప్రకటించగా తాజాగా 13వ తేదీ వరకు పొడిగించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాకి చెందిన బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. https:// apbragcet.apcfss. in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

పాడుతా తీయగా విజేత ధీరజ్‌కు సన్మానం



ధీరజ్‌ను సత్కరిస్తున్న ప్రముఖ వ్యాపారి నారాయణరావు కుటుంబ సభ్యులు

నర్సీపట్నం : పాడుతా తీయగా మహాసంగ్రామంలో తృతీయ బహుమతి సాధించిన నర్సీపట్నం వాసి దొంతంశెట్టి ధీరజ్‌ను ప్రముఖ వ్యాపారి వెలగా నారాయణరావు దంపతులు స్వగృహంలో గురువారం ఘనంగా సత్కరించారు. ధీరజ్ తల్లిదండ్రులను సన్మానించారు. ధీరజ్ పాటల మాధుర్యాన్ని పంచడంతో పాటు చిత్రకళ, ఫోటోగ్రఫీ, రచనల్లో కాకుండా అనేక భాషల్లో గాన గంధర్వుడని కొనియాడారు. రాబోయే రోజుల్లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని అకాంక్షించారు. సన్మానించిన వారిలో కంకటాల శిల్ప, వాసవీక్లబ్ జోన్‌చైర్మన్ పద్మనాభుని రాజేశ్వరి ఉన్నారు.

విశాఖ ఆర్‌డీ ఆఫీసుకు చంద్రశేఖర్ బదిలీ

మహారాణిపేట : అనకాపల్లి వైద్య ఆరోగ్యశాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సిహెచ్.చంద్రశేఖర్‌కు బదిలీ అయింది. చంద్రశేఖర్‌ను వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం(విశాఖ)లో నియమిస్తూ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

పాకలపాడులో కేంద్రబృందం



లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

గొలుగొండ : పాకలపాడు గ్రామంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలపై గురువారం కేంద్రం బృందం సభ్యులు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ప్రజలతో సమావేశం అనంతరం కేంద్రం మంజూరు చేసిన రోడ్లు, గృహాలు పింఛన్లు, డ్వాక్రా సభ్యులు పనితీరు, గ్రామ సడన్‌యోజన పథకం తీరుపై పరిశీలన చేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరులో అర్హత పొందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి వాటి పనితీరు, అందే విధానం గురించి క్షణ్ణంగా పరిశీలన చేశారు. గ్రామాల్లో పేదలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అనేక పథకాలు అందుతున్నాయని వాటి పనితీరుపై పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తున్నట్టు కమిటీ సభ్యులు వికాస్ మలేకర్, భానుచందర్, లోకేష్ తదితరులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ రోజ్‌తో పాటు పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

గొలుగొండ డిపోలో వెదురు అమ్మకాలు

- డిపో సందర్శించిన డీఎఫ్‌వో శ్యామ్యూల్



వేలం పాట నిర్వహిస్తున్న డీఎఫ్‌వో

గొలుగొండ : ప్రభుత్వానికి టేకు, వెదురు అమ్మకాల వల్ల ఆదాయం తీసుకురావడం జరుగుతుందని నర్సీపట్నం డీఎఫ్‌వో శ్యామ్యూల్ తెలిపారు. ఆయన గురువారం గొలుగొండ కలప డిపోను సందర్శించారు. ప్రతి నెల 6వ తేదీన గొలుగొండ కలప డిపోలో వెదురు, టేకు అమ్మకాలు జరుగుతున్న కారణంగా ఈ రోజు ఇక్కడికి రావడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం టేకు నిల్వలు తక్కువగా ఉన్నాయని, వెదురు అమ్మకాలు జరుగుతున్నట్లు చెప్పారు. గొలుగొండ కలప డిపో ద్వారా ప్రతి ఏటా రూ.కోట్లలో టేకు అమ్మకాలు జరుగుతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం వెదురు నిల్వలు అమ్మకాలు జరుగుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కృష్ణదేవిపేట, గొలుగొండ రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ దర్బారులో ఏటికొప్పాక బొమ్మ

- రాష్ట్రపతి భవన్‌లో లక్క బొమ్మల ప్రదర్శన
- హస్త కళాకారుడు పెదపాటి శరత్‌కు అరుదైన అవకాశం



హస్తకళాకారుడు శరత్‌ను అభినందిస్తున్న ప్రముఖ గాయని మంగ్లీ

యలమంచిలి రూరల్ : ఖండాంతర ఖ్యాతినార్జించిన ఏటికొప్పాక హస్తకళకు మరోసారి అరుదైన గౌరవం దక్కింది. ఢిల్లీ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రాష్ట్రపతి భవన్‌లో ఏటికొప్పాక లక్కబొమ్మల ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. ఈ నెల 9 వరకు ఈ ప్రదర్శన ఉంటుందని హస్తకళాకారుడు పెదపాటి సత్యనారాయణ శరత్ 'సాక్షి'కి తెలిపారు. ఇంతటి అరుదైన అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రదర్శన ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏటికొప్పాక లక్కబొమ్మల ప్రత్యేకతను ప్రస్తావించారని పేర్కొన్నారు. ప్రముఖ గాయని మంగ్లీ గురువారం లక్కబొమ్మలను చూసి అబ్బురపడ్డారని తెలిపారు. గతంలో మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ మెప్పును పొందిన లక్కబొమ్మలు మరోసారి రాష్ట్రపతి ప్రశంసలు అందుకోవడం పట్ల ఏటికొప్పాక హస్తకళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సహజసిద్ధమైన రంగులతో కళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్న లక్కబొమ్మలు చూస్తే ఎవరైనా ఔరా అనాల్సిందే.



రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన లక్కబొమ్మల స్టాల్

మహిళా సాధికారతకు తోడ్పాటు

- విద్య, ఉద్యోగ సాధనలో ముందడుగు వేయాలి
- ఎస్పీ తుహిన్ సిన్హా
- కళాశాల విద్యార్థినులతో ఓపెన్ హౌస్
- ఘనంగా మహిళా సాధికార వారోత్సవాలు





పోలీసులు ఉపయోగించే భద్రత ఆయుధాల గురించి విద్యార్థినులకు వివరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, (ఇన్‌సెట్) పోలీసు కంట్రోల్ రూంలో ఉన్న సీసీ సర్వైలెన్స్ మానిటరింగ్ వీడియో చూపిస్తున్న ఎస్పీ

సాక్షి, అనకాపల్లి :

విద్య, ఉద్యోగ సాధనలో మహిళల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సాధికార వారోత్సవాల్లో భాగంగా వివిధ కాలేజీల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిమశేఖర్ డిగ్రీ కాలేజ్ , ఆదినారాయణ మహిళా డిగ్రీ కాలేజ్, ఏఎంఏఎల్ కళాశాల, డైట్ కళాశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, ఇతర భద్రతా పరికరాలను గూర్చి అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆటలు, చిత్రలేఖన పోటీలు, వ్యాసరచన పోటీలు, డిబెట్‌లు, సంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మార్చి 1 నుంచి మహిళా సాధికార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలందరూ తమ తమ హక్కుల గురించి, చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో పురుషులతో పోటీగా మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిని గురించి అవగాహన కల్పించి, మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. ఒత్తిడిని, సమస్యలు ఎదురైన సమయంలో .. వాటిని ఎదుర్కొని మహిళలు ధైర్యంగా నిలవాలని తెలియజేశారు. మహిళలు ఉన్నత చదువులు అభ్యసించి తనకు తాను ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని కోరారు.

అత్యవసర సమయాల్లో .. హెల్ప్‌లైన్‌లకు సమాచారం ఇవ్వండి

మహిళలు, చిన్నారులు ఎలాంటి ప్రమాదంలో చిక్కుకున్నా వెంటనే సహాయం అందించేలా హెల్ప్ లైన్ నంబర్లు వారికి తెలియజేసి, అత్యవసర సమయాల్లో కాల్ చేసి పోలీసులు సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్. మోహనరావు, ఎస్‌బీఎస్పీ బి.అప్పారావు, మహిళా డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఏఆర్ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, బాల సూర్యారావు, రామకృష్ణారావు, మన్మథరావు, వెంకటచిట్టి ఎస్ఐలు వెంకన్న, సురేష్ బాబు, ఆదినారాయణ ఇతర అధికారులు సిబ్బంది, వివిధ కాలేజీ విద్యార్థులకు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసం హెల్ప్‌లైన్ నంబర్లు

చైల్డ్ హెల్ప్ లైన్	1098
ఉమెన్ హెల్ప్ లైన్	181
పోలీస్ హెల్ప్ లైన్	100 / 112
సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్	1930
ఈగల్ హెల్ప్ లైన్	1972

నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

అనకాపల్లి జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 94409 04229

'పరీక్ష'లు చాలించి... రాలిన విద్యాకుసుమం

- కోనవానిపాలెంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య
- అనారోగ్యమే కారణమంటూ.. సూసైడ్ లేఖ







మృతురాలు సృజన జయప్రియ, సూసైడ్ నోట్

ఎస్.రాయవరం : పరీక్షల ఒత్తిడో...అనారోగ్య కారణమో....లేత మనసుకు తగిలిన గాయమో...ఓ బాలిక ఉసురు తీసింది. పరీక్షల సమయంలోనే ఓ విద్యా కుసుమం రాలిపోయింది.. కోనవానిపాలెం గ్రామంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలిక ఉరి పోసుకుని గురువారం మృతి చెందింది. ఎస్ఐ విభీషణరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు తుని చైతన్య కళాశాలలో చదువుతున్న విద్యార్థిని జోగా సృజన జయప్రియ (17) బుధవారం ఇంగ్లిష్ పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. అప్పటి నుంచి నీరసంగా ఉండడంతో ఆమెను ఇంటి దగ్గర ఉంచి, తల్లిదండ్రులు గురువారం మధ్యాహ్నం ఓ ఫంక్షన్‌కి వెళ్లారు. ఇంటిదగ్గర ఎవరూ లేని సమయం చూసి సృజన జయప్రియ సూసైడ్ నోట్ రాసి ఉరిపోసుకుని చనిపోయింది. ఈ సూసైడ్ నోట్‌లో 'అమ్మ, నాన్న నన్ను క్షమించండి...నా చావుకి నా ఆరోగ్యమే కారణం ఈ బాధలు తట్టుకోలేక పోతున్నాను...దేని మీద దృష్టి పెట్టలేక చాలా బాధపడ్డా.. నా కోరిక తీర్చుకోలేనేమోనని నాలో నేనే చాలా బాధ అనుభవించాను...సారీ అమ్మ ఎందుకు చనిపోయానో కారణం ఎవరికీ చెప్పకండి.. నేను బ్రతికుండి ప్రయోజనం లేదు..తమ్ముడు చరణ్, చిన్నాని మీరు బాగా ఉండండి మీరంటే నాకు చాలా ఇష్టం. అమ్మని బాగా చూసుకోండి...నాన్నను బాధపెట్టకండి నాన్న చెప్పిన మాట ఆలకించండి.. నేనే చనిపోతున్నందుకు చాలా బాధగా ఉంది.. లవ్‌యు అమ్మ, నాన్న అండ్ మై బ్రదర్స్ గుడ్‌బై..' అని రాసింది. ఈ లెటర్ చదివిన వారందరూ కన్నీటి పర్యంతమయ్యారు. చదువులో మంచి మార్కులు తెచ్చుకుని ఆమెకు అందమైన జీవితం ఉంటుందనుకున్న తరుణంలో కుటుంబ సభ్యులను తీరని దుఃఖ సాగరంలో ముంచి బాలిక మృతి చెందిందని ఆవేదన చెందారు. గ్రామంలో ఈ బాలిక మృతి వార్త విని ప్రతి ఒక్కరూ విషాదంలో మునిగిపోయారు. చదువు ఒత్తిడి, చిన్న ఆనారోగ్యం బాలిక ప్రాణాలు తీశాయని పోలీసులకు తెలిపారు. వివరాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దారి కాచి దారుణం...

- నడిరోడ్డుపై యువకుడి దారుణ హత్య
- బైక్ అడ్డగించి పీక కోసిన గుర్తు తెలియని వ్యక్తులు
- మూడు ప్రత్యేక బృందాలతో దుండగుల కోసం పోలీసుల గాలింపు 8లో

పేదల ఆర్థిక సాధికారతకు పీ–4 సర్వే

- ఈ నెల 8 నుంచి 18 వరకు కార్యక్రమం
- 27 ప్రశ్నలతో పీ4 సర్వే యాప్
- కలెక్టర్ విజయకృష్ణన్



తుమ్మపాల : పేదరికం లేని సమాజం లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో (పి4) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ గ్రామ, వార్డు సచివాయాల సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పి4 సర్వేపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయల సిబ్బందికి వర్చువల్‌గా పీ4 సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, వారి జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో గల 20 శాతం మంది నిరుపేదలను గుర్తించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయడం పీ4 సర్వే విధాన లక్ష్యమన్నారు. పి4 లక్ష్య సాధనకు ఈ నెల 8 నుంచి 18 తేదీ వరకు సర్వే చేయాలన్నారు. పేదల అవసరాలను గుర్తించి, వారి సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పనకు ఈ సర్వే దోహదం చేస్తుందని కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు.

సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా సమర్థమైన ప్రణాళికల రూపకల్పనకు వీలవుతుందన్నారు. ఈ సమాచారాన్ని కుటుంబాలకు వివరించి కుటుంబ వివరాలతో పాటు వివిధ సామాజిక, ఆర్థిక పరిమితులతో కచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచిన 27 ప్రశ్నల ద్వారా సేకరించాలని ఆదేశించారు. కుటుంబాలకు ఏవైనా అపోహలు ఉంటే తొలగించి, సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో సమష్టి భాగస్వామ్యంతో సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర -2047' లక్ష్యంగా వచ్చే ఐదేళ్లలో పేదరిక నిర్మూలనకు, రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశంగా నిలిచిన '10 సూత్రాలు' ఫ్రేమ్‌వర్క్‌లో 'జీరో పావర్టీ పీ4 పాలసీ' అత్యంత ప్రాముఖ్యత అంశం కనుక ఈ విధానం పై ప్రజల అభిప్రాయం క్యూఆర్ కోడ్, https://swarnandhra.ap.gov.in/p4 వెబ్ పోర్టల్ ద్వారా అత్యధిక సంఖ్యలో సేకరించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ తహసీల్దార్‌పై ఫిర్యాదులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో తహసీల్దార్(భూసేకరణ)గా విధులు నిర్వర్తిస్తున్న కోరాడ వేణుగోపాల్‌పై వరుస ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆయన ఎస్.రాయవరం మండలం తహసీల్దార్‌గా పని చేసిన సమయంలో చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆయనపై చట్టపరంగానే కాకుండా సర్వీస్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీఎం, డిప్యూటీ సీఎం, హెచ్‌ఆర్‌డీ మంత్రి, డీజీపీ, సీసీఎల్ఏ, ఇతర అధికారులతో పాటు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్‌కు కూడా రాతపూర్వకంగా ఫిర్యాదులు చేశారు. గతంలో తప్పుడు ధృవపత్రాలు సమర్పించి ఎంపీటీసీ, ఎంపీపీలుగా గెలిచినట్లు నిర్ధారణ అయినప్పటికీ.. ఎన్నికల్లో వారిని అనర్హులుగా ప్రకటించకపోవడంపై వేణుగోపాల్‌పై విచారణ చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. అలాగే ఆయన ఎస్.రాయవరంలో తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో అనేక అవకతవకలకు పాల్పడి భూ అక్రమాలకు అండగా నిలిచారని.. దీనిపై కూడా విచారించాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి అవినీతి ఆరోపణలు ఉన్న వేణుగోపాల్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత పీఎస్‌గా నియమించాలని ప్రయత్నిస్తుండడం సరైన నిర్ణయం కాదని వారు లేఖలో పేర్కొన్నారు.

చెరకు సాగు ప్రశ్నార్థకం

- ఈ ఏడాది ఆదిలోనే కష్టాలు
- ఇప్పటికీ 10 శాతం కూడా ప్రారంభం కాని చెరకు నాట్లు
- ఆందోళన చెందుతున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ
- రైతులను పట్టించుకోని ప్రభుత్వం



వర్షాలు లేక బోరుపైపుల సాయంతో నాట్లకు నీరు పెడుతున్న రైతు

చోడవరం : రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో జిల్లాలో చెరకు సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఒకప్పుడు బెల్లం, పంచదార ఫ్యాక్టరీలతో ఎక్కడ చూసినా వేలాది ఎకరాల్లో చెరకు సాగుతో పొలాలన్నీ కళకళలాడేవి. ఫిబ్రవరి నెల నుంచే చెరకు నాట్లు వేస్తూ అంతా సందడిగా ఉండేది. ఈ ఏడాది ఆ సందడే కానరాలేదు. ఐదునెలలుగా కనీస వర్షాలు కురవకపోవడం , సుగర్ ఫ్యాక్టరీ రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వకపోవడంతో రైతులు ఈ ఏడాది చెరకు పంటపై అనాసక్తి కనబరుస్తున్నారు. గత నెలలోనే ప్రారంభం కావలసిన చెరకు నాట్లు మార్చినెల ప్రారంభమైనా 10శాతం కూడా వేయలేదు. జిల్లాలో 4సుగర్ ఫ్యాక్టరీలు, ఒక అంతర్జాతీయ బెల్లం మార్కెట్ ఉండడంతో ఏటా 2 లక్షల ఎకరాల్లో చెరకు సాధారణ సాగు జరిగేది. అయితే మూడు ఫ్యాక్టరీలు మూతపడడంతో చెరకు సాగు విస్తీర్ణం తగ్గుకుంటూ రాగా ఈ ఏడాది ఘోరంగా 60 శాతానికి మించి సాగు జరిగే అవకాశాలు కనిపించడం లేదు. గతేడాది కంటే 20 శాతం విస్తీర్ణం తగ్గిపోనుందని సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆందోళన చెందుతుంది. గతేడాదే తగ్గిన చెరకు సాగుతో ఈ ఏడాది క్రషింగ్ లక్ష్యాన్ని చేరుకోలేక ఫ్యాక్టరీ చతికిలబడుతోంది.

గానుగ లక్ష్యం..నానాటికీ తీసికట్టు...

గోవాడ ఫ్యాక్టరీ 5.2 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ కేవలం 1.5 లక్షల టన్నులే లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు కేవలం 60 వేలు టన్నులు మాత్రమే క్రషింగ్ చేసింది. మరో 40 వేల టన్నులకు మించి క్రషింగ్ జరిగే అవకాశాలు లేవు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలోనే చెరకు నాట్లు ప్రారంభమై మార్చి నాటికి 30 శాతానికి మించే నాట్లు జరిగేవి. జిల్లాలో అత్యధికంగా చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పరిధిలోనే సుమారు 80వే ఎకరాలకు పైబడి చెరకు పండిస్తారు. అలాంటిది ఈ ఏడాది అక్కడక్కడ వ్యవసాయ బోర్ల సాయంతో కొందరు నాట్లు వేస్తున్నప్పటికీ వారు కూడా చెరకు పంటపై మక్కువతోనే వేస్తున్నామంటూ నిట్టూర్చడం చెరకు సాగు భవితవ్యంపై ప్రశ్నార్థకం వ్యక్తమౌతుంది. ఉడుపులు ముమ్మరమయ్యే సమయంలో వర్షాలు కురవకపోవడం, జలాశయాలు, నదులు, చెరువులు, కొండగెడ్డల్లో నీటి నిల్వలు లేకపోవడంతో సాగుపై రైతులు నిరాశకు గురయ్యారు. మోటార్ల సాయంతోనైనా నాట్లు వేద్దామంటే భూగర్భ జలాల్లో నీటి నిల్వలు అడుగంటడం.. ఇవన్నీ రైతుకు గుదిబండగా మారాయి.

పట్టించుకోని ప్రభుత్వం

చెరకు రైతులను, సుగర్ ఫ్యాక్టరీలను ఆదుకొని గిట్టుబాటు ధర ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ఫ్యాక్టరీని పట్టించుకోలేదు. మద్దతు ధర టన్నుకు రూ.3100లకు మించి ఇవ్వలేదు. దీనితో రైతులు చెరకుకు బదులు ప్రత్యామ్నాయంగా సరుగుడు, ఇతర పంటలు వేయడానికే సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితిలో ఫ్యాక్టరీలు, ప్రభుత్వం రైతులను ఆదుకుంటే తప్ప ఈ ఏడాది చెరకు కనీస విస్తీర్ణంలో కూడా సాగు జరిగేలా లేదని రైతులు అంటున్నారు.



నాట్లు జరగక ఖాళీగా ఉన్న భూమి

క్లుప్తంగా

ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పీడీ



కూలీలతో మాట్లాడుతున్న దృశ్యం

చీడికాడ : ఎండలు తీవ్రత పెరగడంతో ఉపాధి పనులను ఉదయం 11 గంటలకు ముగించాలని డ్వామా పీడీ ఆర్.పూర్ణిమదేవి సూచించారు. ఆమె గురువారం మండలంలోని కోనాం శివారు గుంటి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ మేరకు ఆమె కూలీలతో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6 గంటలకు పనులు ప్రారంభించి 11 గంటలకు ముగించాలన్నారు. ప్రతి కుటుంబానికి 150 రోజులు పూర్తి చేయాలన్నారు. రోజువారి రూ.300 వేతనం వచ్చే విధంగా పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ శ్రీనివాస్, ఏపీవో గంగ నాయుడు తదితరులున్నారు.

బాలలతో పని చేయించడం నేరం



చీడికాడలో ఒక దుకాణం వద్ద పరిశీలిస్తున్న బాలల హక్కుల ప్రతినిధులు

చీడికాడ: బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు అన్నారు. గురువారం మండల కేంద్రం చీడికాడలో పలు దుకాణాలను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బాలలను కార్మికులుగా పని చేయిస్తే చట్టప్రకారం శిక్షార్హులన్నారు. అనంతరం చీడికాడ పోలీసుస్టేషన్‌లో బాలికలతో సమావేశం నిర్వహించారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెచ్.సి రమణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బుచ్చెయ్యపేట: మండలంలోని ఆర్.శివరాంపురం గ్రామం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. రాజాం నుంచి మల్లాం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని కూడ్రం నుంచి రాజాం వైపు వస్తున్న స్కూల్ వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో గొరపల్లి మణి, అప్పారావు, ఆది బుల్లికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేటు వాహనంలో అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్సు యాజమాన్యం కనీసం బాధితులను పట్టించుకోకుండా వెళ్లిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యమంపై షోకాజ్
ఉక్కుపాదం



- నినదించే గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం
- స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు
- యాజమాన్య వైఖరికి నిరసనగా నేడు స్టీల్ సీఐటీయూ ధర్నా

సాక్షి, విశాఖపట్నం : విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ఎలా గాడిలో పెట్టాలన్నదానిపై ఆలోచనలు చేయకుండా.. ఉక్కు భవిష్యత్తు కోసం పోరాడుతున్న వారిపై జులుం ప్రదర్శించడంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అత్యుత్సాహం చూపిస్తోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ని ఎలాగైనా కాపాడుకోవాలన్న ఉక్కు సంకల్పంతో పోరాటం చేస్తున్న ఉద్యమ నాయకుల్ని భయపెట్టేందుకు యాజమాన్యం షోకాజ్‌లు జారీ చేస్తోంది. ఆది నుంచి పోరుబాటలో ముందున్న స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తూ షోకాజ్ నోటీసు జారీ చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నిరంతర పోరాటాల వల్లే..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం కేంద్ర ప్రభుత్వం నోట నుంచి వచ్చినప్పటి నుంచి ఉద్యమ జ్వాల ఎగసిపడింది. అప్పటి నుంచి విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు అన్ని సంఘాలు అలుపెరగని పోరాటం చేస్తున్నాయి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం, నిరంతరం రోడ్లపై ఉద్యోగ కార్మిక సంఘాలు పోరాటం చేయడం వల్ల.. నాలుగేళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ జోలికి కేంద్రం రాలేకపోయింది. తాజాగా దిద్దుబాటు చర్యలు చేపడుతున్నట్లుగా రూ.11 వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. తాత్కాలిక ఉపశమనం కల్పించినా.. ఆర్ఐఎన్ఎల్‌కు ప్రైవేటీకరణ ముప్పు మాత్రం ఇంకా పొంచి ఉండటంతో ఉద్యమ నాయకులు పోరాటం ఆపలేదు. అయితే స్టీల్‌ప్లాంట్ గురించి ఎక్కడా మాట్లాడకూడదు.. వీఆర్ఎస్, హెచ్ఆర్ఏ, ఉద్యోగులు, కార్మికుల జీతాల కోసం ఎక్కడా నోరు మెదపకూడదంటూ యాజమాన్యం ఆంక్షలు విధించింది. అయినా.. కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు ఎక్కడా వెనకడుగు వేయకుండా హెచ్ఆర్ఏ, విద్యుత్ చార్జీలు, వీఆర్ఎస్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై నిరంతరం రోడ్డెక్కి పోరాడుతున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్‌కు యాజమాన్యం గురువారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా సీఐటీయూ గౌరవాధ్యక్షునిగా ప్రచారం చేశారంటూ మండిపడుతూ.. ఈ చర్యలపై ఏడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఎంఎంఎస్ఎం డిపార్ట్‌మెంట్ డిసిప్లినరీ అథారిటీ డీజీఎం(ఎలక్ట్రికల్) ఉమాకాంత్ గుప్తా నోటీసులో పేర్కొన్నారు.

యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ..

స్టీల్ యాజమాన్యం అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీస్ ఇవ్వడంపై సీఐటీయూ శ్రేణులు మండిపడుతున్నాయి. అధికారుల చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నా చేస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రామస్వామి తెలిపారు. నోటీసులు వెనక్కు తీసుకునేంత వరకూ ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

ఉక్కును కాపాడుకోవడమే నా విధానం: అయోధ్యరామ్



స్టీల్‌ప్లాంట్ నోటీసులపై అయోధ్యరామ్ గట్టిగానే స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్ స్పందించారు. నోటీసులతో గొంతు నొక్కాలని ప్రయత్నిస్తే.. వేల గొంతులు ఒక్కటై పిక్కటిల్లేలా ఉద్యమిస్తామని హెచ్చరించారు. నోటీసుకు ప్రతిస్పందనగా యాజమాన్యానికి లేఖ రాశారు. కార్మికులు, ఉద్యోగుల హక్కుల గురించి పోరాడటమే తన విధానమనీ.. స్టీల్‌ప్లాంట్‌ని కాపాడుకునేంత వరకూ రోడ్డెక్కి ఉద్యమిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. సీఐటీయూ నాయకునిగా కార్మికుల సమస్యలపై పోరాడటం తమ బాధ్యత అన్నారు. నోటీసులో పేర్కొన్న సమస్యలపై తమ పోరాటం కొనసాగిస్తామే తప్ప భయపడేది లేదని తెగేసి చెప్పారు.

పది, ఇంటర్‌లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యం

- బీసీ, ఎస్సీ వెల్ఫేర్ డీడీ రాజేశ్వరి
- నర్సీపట్నంలో వసతి గృహాల సందర్శన



మరమ్మతులను పరిశీలిస్తున్న డీడీ రాజేశ్వరి

నర్సీపట్నం: ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులను సమాయత్తం చేశామని బీసీ, ఎస్సీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కె.రాజేశ్వరి తెలిపారు. నర్సీపట్నంలోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు వసతి సరిపోవడం లేదని వార్డెన్ రాజ్యలక్ష్మి డీడీ దృష్టికి తీసుకెళ్లారు. అదనపు భవనం మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని డీడీ బదులిచ్చారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వసతిగృహాల్లో జరుగుతున్న మరమ్మతుల పనులను పరిశీలించి, సంక్షేమాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీడీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో బీసీ వసతి గృహాల నుంచి 645 మంది, ఎస్సీ వసతి గృహాల నుంచి 344 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షలకు బీసీ కాలేజీ వసతిగృహాల నుంచి 700 మంది, ఎస్సీ కాలేజీ వసతి గృహాల నుంచి 130 మంది హాజరవుతున్నట్టు చెప్పారు. విద్యార్థులకు అన్ని విధాలా తర్ఫీదు ఇచ్చామన్నారు. బీసీ వసతి గృహాల మరమ్మతులకు రూ.72 లక్షలు, ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు రూ.4.20 కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ వసతిగృహం వార్డెన్ అర్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన



బుచ్చెయ్యపేటలో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించి తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ ఎల్.సింగవరం గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని కొండల వద్ద ఉన్న ప్రభుత్వ బంజరు భూమిలో గురువారం జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టడానికి వెళ్లిన కూలీలను అదే గ్రామానికి చెందిన కొంత మంది అడ్డుకున్నారు. ఈ భూమిని నమ్ముకుని తుప్పలు తొలగించి మొక్కలు పెంచుకుని ఉపాధి పొందుతున్నామని, ఇక్కడ ఉపాధి పనులు చేపట్టొద్దని కూలీలను అడ్డగించారు. దీంతో గ్రామ నాయకులు కలగజేసుకుని ఉపాధి పనులను అడ్డుకోవద్దని సాగు రైతులకు సూచించారు. ఈ క్రమంలో ఉపాధి కూలీలు, సాగు రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఉపాధి పనులు కల్పించాలని కూలీలు రేణం శ్రీను, రామోజీరావు, రాము, గజ్జాలమ్మ, పి.నాగేశ్వరరావు, వి.పుష్పా, కె.బుల్లమ్మ, తదితర్లు బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ లక్ష్మి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

ఏపీఐఐసీ చైర్మన్‌కు నిర్వాసితుల వినతి



చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

నక్కపల్లి : మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ వారు సేకరించిన భూములను ఏపీఐఐసీ చైర్మన్, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు గురువారం పరిశీలించారు. రాజయ్యపేట, డీఎల్‌పురం, అమలాపురం తదితర గ్రామాల్లో పర్యటించి ఎన్ని ఎకరాలు సేకరించారు.. వాటిలో జిరాయితీ ఎంత? ప్రభుత్వ, డీఫారం భూములు ఎంత? అనే వివరాలు తెలుసుకున్నారు. బల్క్ డ్రగ్ పార్క్, ఆర్సిలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా స్టీల్‌ప్లాంట్ వారికి ఎంత భూములు కేటాయించారు.. అనే వివరాలపై ఆరా తీశారు. అనంతరం రాజయ్యపేట సమీపంలో జరుగుతున్న బల్క్ డ్రగ్ పార్క్ పనులు పరిశీలించారు. ఏపీఐఐసీ వారు నిర్మిస్తున్న అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు నిర్వాసితులు చైర్మన్‌ను కలిసారు. భూసేకరణ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు ప్రత్యేక ప్యాకేజీ చెల్లించాలన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే కంపెనీల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలన్నారు. డీఫారం భూముల్లో మామిడి,జీడితోటలకు నష్టపరిహారం చెల్లించలేదని, జిరాయతీ రైతులతో సమానంగా వీరికి కూడా పరిహారం చెల్లించాలని కోరారు.

కుట్టు శిక్షణ ఉంది..
అంగన్‌వాడీ భవనం ఖాళీ చేయండి.!

- వమ్మవరంలో కూటమి నాయకుడి దౌర్జన్యం
- ఎటువంటి సమాచారం లేకుండా సామగ్రి తరలింపు
- అడ్డగించిన అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు



అంగన్‌వాడీ కేంద్రంలో సామగ్రిని తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎస్.రాయవరం: కూటమి నాయకుల బెదిరింపులకు అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. చిన్నారుల ప్రాథమిక విద్యకు ఎంతో ఉపయోగపడుతున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం వదలడం లేదు. తమ అవసరాల కోసం మూడు నెలల పాటు ఈ కేంద్రాన్ని అప్పగించి వేరే చోటకు మారాలని ఒత్తిడి చేస్తున్నారు. అంతటితో ఆగకుండా కేంద్రంలోని సామగ్రిని పంచాయతీ స్వీపర్లతో తరలించడం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. వమ్మవరం పంచాయతీ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భవనంలో నాలుగేళ్లుగా రెండో నంబర్ గల అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. అంతకు ముందు 18 ఏళ్ల పాటు ఈ కేంద్రం అద్దె భవనంలో నడిచేది. అప్పట్లో ఖాళీగా ఉన్న ఈ భవనాన్ని సర్పంచ్ పాలపర్తి పాపారావు అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారు. అప్పటి నుంచి దళిత కాలనీ పరిధిలో ఉన్న ఈ భవనంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు, కిషోర్ బాలికలకు సేవలందిస్తూ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు.

ఈ నేపథ్యంలో మాజీ ఎంపీటీసీ కూటమి ప్రభుత్వం అండదండలతో మహిళలకు కుట్టు శిక్షణ ఉంది ఈ భవనం తనకు 3 నెలలు పాటు కావాలని ఒత్తిడి చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా పంచాయతీ స్వీపర్లు వెంటబెట్టుకొని వచ్చి గురువారం ఈ భవనంలో ఉన్న అంగన్‌వాడీ సామగ్రిని తరలించే ప్రయత్నం చేశారు. ఉన్న పళంగా వేరే భవనానికి ఎలా వెళ్లాలని అంగన్‌వాడీ సిబ్బందితో పాటు లబ్ధిదారులు మాజీ ఎంపీటీసీని ప్రశ్నించారు. దళిత కాలనీకి అందుబాటులో ఉన్న ఈ భవనం నుంచి అంగన్‌వాడీ కేంద్రాన్ని తొలగించవద్దని, గ్రామానికి దూరంగా మారిస్తే చిన్నారులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. అయినా వినిపించుకోకపోవడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు కలగజేసుకున్నారు. భవనంలో తీసిన సామగ్రిని యథావిధిగా పెట్టి అక్కడి నుంచి వెనక్కి రావాలని సూచించారు.

దీంతో సామగ్రి తొలగింపు ప్రక్రియ తాత్కాలికంగా నిలిపివేశారు. కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవోను సంప్రదించగా.. కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రతిపాదన ఉందని, గ్రామంలో అనువైన భవనం చూసి ఏర్పాటు చేస్తామన్నారు. నిర్వహణలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని ఖాళీ చేయాలని తాము ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదన్నారు.

100 అడుగుల వెడల్పున లంకెలపాలెం-అసకపల్లి రోడ్డు

- భూ సేకరణ గ్రామ సభలో ఆర్డీవో షేక్ ఆయిషా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ అయిషా

సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారం నుంచి లంకెలపాలెం-అసకపల్లి రోడ్డును అనకాపల్లి జిల్లా కోడూరు గ్రామంలోని ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈ పార్కు వరకూ రెండు వరసల రహదారిగా విస్తరించనున్నట్లు ఆర్డీవో షేక్ ఆయిషా తెలిపారు. మండలంలోని పైడివాడ అగ్రహారంలో రోడ్డు విస్తరణకు అవసరమయ్యే భూ సేకరణపై రైతులకు అవగాహన కల్పించేందుకు గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో 100 అడుగుల వెడల్పున రెండు లేన్లలో 2.68 కి.మీ. మేర ఈ రోడ్డును విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ డీపీఆర్ ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందన్నారు. గ్రామంలో 12.26 ఎకరాల మేర భూమిని సేకరించే అవకాశం ఉందని వెల్లడించారు. విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు వీఎంఆర్డీఏ ద్వారా టీడీఆర్ బాండ్లు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నికృష్ణ, మండల సర్వేయర్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబు, ఎంపీటీసీ సీరం అప్పలరాజు, గ్రామ పెద్దలు అక్కిరెడ్డి దుర్గినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు



లాటరీ తీస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ

అనకాపల్లి: జిల్లాలో మద్య నిషేధ అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు 15 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతి ద్వారా కేటాయించినట్టు డీఆర్వో వై.సత్యనారాయణ తెలిపారు. స్థానిక గుండాల జంక్షన్ ఎస్ఆర్ శంకరన్ ఫంక్షన్ హాల్లో గురువారం లాటరీ పద్ధతి ద్వారా గీత కులాల వారికి షాపులు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 మద్యం దుకాణాలకు 205 దరఖాస్తులు వచ్చాయన్నారు. మద్యం షాపు దక్కించుకున్న దరఖాస్తుదారుడు తక్షణమే రిటైల్ ఎక్సైజ్ టాక్స్ రూ.5,41,667 లేదా రూ.4,58,333 మొదటి విడతగా చెల్లించి లైసెన్స్ పొందాలన్నారు. కల్లుగీత కార్మికులకు కేటాయించిన 15 మద్యం దుకాణాల నాన్ రిఫండబుల్ కింద రూ.4.10 కోట్ల ఆదాయం సమకూరిందని చెప్పారు. లైసెన్స్ ఫీజు కింద రూ.78.75 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మద్య నిషేధ అబ్కారీ శాఖ అధికారి వి.సుధీర్, అబ్కారీ అధికారి రాజశేఖర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

దుకాణాలు దక్కించుకున్న గీత కార్మికుల వివరాలు

షాపు	లబ్ధిదారుడు
అనకాపల్లి రూరల్	సీహెచ్.మారుతీరాజు
మునగపాక	పిల్లి శ్రీను
రోలుగుంట	దార శ్రీనివాస్
కోటవురట్ల	దమ్ము రోహిణి
మాకవరపాలెం	రేలంగి కిరణ్‌కుమార్
నాతవరం	చిన్ని నానాజీ
యలమంచిలి	రేలంగి ఎల్.ఎన్.అశ్విని
రాంబిల్లి	కదాలి రాజ్యలక్ష్మి
దేవరాపల్లి	సిమ్మా దేముళ్లు
బుచ్చియ్యపేట	అనసూరి అనంద్
పాయకరావుపేట	లవిటి నూకరాజు
నక్కపల్లి	దొడ్డి అప్పలరాజు
వి.మాడుగుల	యల్లంకి లావణ్య
చీడికాడ	సమ్మంగి లక్ష్మణ్
రావికమతం	కడవల ఉపేంద్ర

భారతీయ మహిళలు ధైర్యవంతులు

జాతీయ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి

విశాఖ విద్య: భారతీయ మహిళలు ఎంతో ధైర్యవంతులని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్.విజయభారతి అన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో దుర్గాబాయి దేశముఖ్ సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, ఏబీఆర్ఎస్ఎం-లేడీ టీచర్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2025 వర్క్‌షాప్ ఆక్సెలరేట్ యాక్షన్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ విద్యతో సమాజాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సంస్కారవంతమైన యువతకు తల్లిదండ్రులే కీలకమని చెప్పారు. సమాజం కోసం, దేశం కోసం అనే భావనతో యువత ముందుకెళ్లాలని సూచించారు. వివేకానందుడు కలలుగన్న విధంగా యువతరం ఉజ్వల తారలుగా మారి, తమ ఆశయాలను సాకారం చేసుకోవాలన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల విజయగాథలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎ.పల్లవి ఆంధ్రప్రదేశ్ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ పి.శ్రీదేవి, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎన్‌హెచ్ఆర్‌సీ సభ్యురాలు విజయభారతిని వైస్‌ఛాన్సలర్ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు జ్ఞాపిక అందించి, సత్కరించారు.

దారి కాచి దారుణం...

అనకాపల్లి : బుచ్చెయ్యపేట మండలం కరక గ్రామానికి చెందిన భీమవరపు నూకేష్ (28) ను బుధవారం రాత్రి అనకాపల్లి మండలం కుంచంగి గ్రామం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పీక కోసి పరారయ్యారు. నూకేష్ అక్కడికక్కడే రక్తపు మడుగులో పడిపోయాడు. అటుగా వెళుతున్న వాహనదారులు, స్థానికులు రోడ్డుపై పడి ఉన్న నూకేష్‌కుమార్‌ను హుటాహుటిన 108 వాహనంలో ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ అశోక్‌కుమార్ సంఘటన స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం రూమ్‌లో భద్రపరిచి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గురువారం తెల్లవారుజామున మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా నలుగురు అనుమానితులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నారు.



కుంచంగి గ్రామం సంఘటన స్థలం వద్ద నూకేష్ ద్విచక్రవాహనం

ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద మిన్నంటిన రోదనలు

ఈ ఘటనపై సమాచారం అందుకున్న మృతుడి భార్య ఇందు, రెండేళ్ల కుమారుడు సాత్విక్, ఇతర కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయం వద్దకు చేరుకుని భోరున విలపించారు. భీమవరపు నూకేష్ విశాఖ డాక్‌యార్డులో కాంట్రాక్టర్ వద్ద కార్పెంటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నిత్యం బుచ్చియ్యపేట నుంచి విశాఖకు బైక్‌పై రాకపోకలు సాగిస్తున్నాడు. గతంలో నూకేష్ బెట్టింగ్‌లో కొంత నగదు పోగొట్టుకోగా, ఆ సమయంలో బెట్టింగ్ గ్యాంగ్‌కు కుటుంబ సభ్యులు అప్పులు తీర్చారు. ప్రస్తుతం ఎటువంటి అప్పులు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం సెలవు తీసుకుని ఇంటి వద్దనే ఉన్న నూకేష్ రాత్రి 8 గంటల సమయంలో ఫోన్ కాల్ రావడంతో బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట గ్రామానికి స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని వెళ్లాడు. అక్కడ నుంచి అనకాపల్లి వస్తుండగా కుంచంగి వద్ద నూకేష్ దుండగుల దాడికి గురయ్యాడు.



ఎన్టీఆర్ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుడి భార్య, కుమారుడు

నిందితులను పట్టుకుంటాం : రూరల్ సీఐ అశోక్‌కుమార్

మండలంలో కుంచంగి గ్రామం వద్ద హత్యకు గురైన నూకేష్ ఘటనలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిందితులను త్వరలోనే పట్టుకోవడం జరుగుతుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని, మృతుడి భార్య ఇందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

క్లుప్తంగా

రాఘవేంద్రస్వామి ఆలయంలో పూజలు



రాఘవేంద్రస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధి రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామి వారి 430వ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం పంచాభిషేకం అనంతరం అలంకరణ సేవ, అష్టోత్తర పూజ, మహా పూజ, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తాటికొండ రాంబాబు, తాటికొండ జీవన్, ఆలయ ఈవో మురళీ, గ్రంధి సుభాషిని, రాఘవేంద్ర స్వామి బృందావన సేవా సమితి సభ్యులు ఇంజినీర్ శ్రీనివాసరావు, మల్లా చంద్రశేఖర్, బొండాడ జగదాంబ, కృష్ణాజీ, గుండా రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య ఛేదనకు కృషి చేయాలి

కశింకోట: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను అధిగమించడానికి సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి. రవికుమార్ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ అమలు జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలపై సమీక్ష జరిపారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వ్యాక్సిన్ కోల్డు చైన్ (శీతలీకరణ)ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి వీపీ సుబ్బారావు, ఆరోగ్య బోధకుడు ఎంఎస్వీ ప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకులు కేఎస్ఆర్కేజీ నరసింహారావు, ఆర్. వెంకటలక్ష్మి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి: స్థానిక విజయరామరాజుపేటలో యువతి అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌లకు గురువారం ఫిర్యాదు అందింది. పట్టణ సీఐ టీవీ విజయకుమార్ కథనం మేరకు ఈనెల 5వ తేదీ ఉదయం ఇంటి నుండి బజారుకు వెళ్లి వస్తానని చెప్పి నేటికీ రాకపోవడంతో యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: వివిధ కార్పొరేషన్ల ద్వారా కాపు, తెలగ, బలిజ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రహ్మణ కులాలకు చెందిన మహిళలు కుట్టు శిక్షణ పొందేందుకు ఈ నెల 7 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.పెంటాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగి, తెల్ల రేషన్ కార్డు, ఆధాయ, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు కలిగి ఉండాలన్నారు. apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణలో 75 శాతం హాజరు కలిగి, ఎంపిక కాబడిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టుమిషన్ అందజేస్తామని తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 7,637 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,530	4,600
మొదటి రకం	3,520	4,100
రెండో రకం	3,120	3,750
మూడో రకం	2,820	3,100

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	: రాజా
పౌరుషం	: సత్యనారాయణ స్క్రీన్-2 (ఉదయం, మ్యాట్నీ)
యాంటీరేస్	: సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
మజాకా	: పర్తిసాయి
ఛావా	: షిర్డీసాయి
కింగ్స్ టన్	: వెంకటేశ్వర
తండేల్	: శ్రీసత్య
శబ్దం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 94 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-15 యూనిట్లు, బీ పాజిటివ్-34 యూనిట్లు, ఓ పాజిటివ్-45 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 354 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 319 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

డంపింగ్ యార్డ్.. తరలింపు ఎప్పుడు?



డంపింగ్ యార్డును తరలించాలని నిరసన తెలుపుతున్న ఉడ్‌పేట నివాసి పాత్రుపల్లి వీరుయాదవ్

అనకాపల్లి: పట్టణ నడిబొడ్డున జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న డంపింగ్ యార్డును తరలించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. గృహాల మధ్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులు తమను గెలిపించినట్లయితే తక్షణమే డంపింగ్ యార్డును తొలగిస్తామని హామీ ఇవ్వడంతో పట్టణ ప్రజలు వారిని గెలిపించారు. అయితే గెలిచిన తర్వాత ఆ నాయకులు డంపింగ్ యార్డు ఊసే ఎత్తడం లేదు.

మండలం నుంచి అనకాపల్లి పట్టణానికి..

మండలంలో కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద డంపింగ్ యార్డును అనకాపల్లి మున్సిపాలిటీగా ఉన్న సమయంలో నిర్వహించేవారు. పట్టణ పరిధిలో ఉన్న చెత్త, చెదారం అంతా కొత్తూరు డంపింగ్ యార్డుకు తీసుకెళ్లేవారు. 2012లో ప్రజారాజ్యం నుంచి అప్పటి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావును గెలిపిస్తే కొత్తూరు నుంచి డంపింగ్ యార్డును తరలిస్తామని చెప్పడంతో గెలిపించారు. ఈ దశలో డంపింగ్ యార్డును అచ్చియ్యపేట గ్రామంలో ఏర్పాటు చేసేందుకు అప్పటి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రయత్నించారు. అయితే గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తును నిరసనలు తెలియజేశారు. కోర్టును ఆశ్రయించడంతో ఏం చేయాలో తెలియక కొత్తూరు గ్రామంలోని డంపింగ్ యార్డును తీసుకొచ్చి జోనల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బందులు..

జోనల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు చెత్తను రోజు మూడు లారీల్లో విశాఖ కాపులుప్పాడకు తరలిస్తున్నారు. పట్టణ పరిధిలో సేకరించిన చెత్త రోజుకు సుమారు 80 నుంచి 90 టన్నులు ఉండడంతో తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డుకు ఆనుకుని గోడ పక్కన జీవీఎంసీ పెద్ద హైస్కూల్, నెహ్రూచౌక్ బస్‌స్టాప్, నాలుగు రోడ్ల జంక్షన్, ఆర్డీవో, పంచాయతీరాజ్, నీటి పారుదల శాఖ, తపాలా శాఖ కార్యాలయం, బ్యాంక్‌లు, ప్రజల ఇళ్లు ఉండడంతో దుర్వాసనతో అంతా ఇబ్బంది పడుతున్నారు. 2012 నుంచి నేటి వరకూ వేల్పులవీధి, ఉడ్‌పేట, న్యూకాలనీ, బారువారి వీధి, మెయిన్‌రోడ్డు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ దుర్వాసన మరీ ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు.

తక్షణం డంపింగ్ యార్డును తరలించాలి..



రహదారికి అటు వైపు డంపింగ్ యార్డు.. ఇటు వైపు మేము నివసిస్తున్నాం. పగలు రాత్రీ తేడా లేకుండా దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. సుమారు 200 కుటుంబాల ప్రజలు 2012 నుంచి నేటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు.

– నాలం ఆషాకుమారి, ఉడ్‌పేట, అనకాపల్లి

దుర్వాసన భరించలేకపోతున్నాం..



పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డు ఏ జిల్లాలో చూడలేదు. దీనిని ఆనుకుని ప్రభుత్వ హైస్కూల్ ఉంది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలి వీచే సమయంలో దుర్వాసన సుమారు రెండు కిలోమీటర్ల వరకు వ్యాపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

– సురేష్, అనకాపల్లి.

రేపటి నుంచి ప్రజా చైతన్య యాత్రలు

అనకాపల్లి: జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 8 నుంచి 31వ తేదీ వరకూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు గురువారం తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కుల కోసం ఈ యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 24, 25 తేదీల్లో మండల కార్యాలయాల వద్ద మహా ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సమస్యల అధ్యయనం కోసం జిల్లావ్యాప్తంగా పర్యటనలు జరగనున్నాయని, పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేస్తామని, కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాల్లో ప్రధానమైన మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించాలని, ఉగాది నాటికి యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ప్రతి నెల రూ.1500 వాగ్దానాన్ని అమలు చేయాలన్నారు. బడ్జెట్లో రాయితీలు ఏమైనా ఇస్తారేమోనని తొమ్మిది మాసాలుగా ప్రజలు ఎదురు చూశారని వారి ఆశలు చంద్రబాబునాయుడు అడియాశలు చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు తగ్గింపు ద్వారా వాటిని కుదించే ప్రయత్నం చేశారని, పీ4 పేరుతో 20 శాతం మంది లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. మూసివేసిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, జీడి మామిడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, మత్స్యకారులకు వేట నిషేధ భృతి నేటికీ చెల్లించలేదని, స్థానిక పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కల్పించడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమైనట్లు ఆయన పేర్కొన్నారు.

చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

అనకాపల్లి టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోన లక్షణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తామని ప్రకటించిందన్నారు. బడా ప్రైవేటు కంపెనీలకు, ఏజెన్సీలకు అప్పగిస్తామని మంత్రివర్గ సమావేశంలో ప్రకటించిందన్నారు. దీంతో ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారని, ఆప్కాస్ రద్దుని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో నిమ్మకాయల నర్సింహమూర్తి, బంగారి రవికుమార్, యర్రంశెట్టి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వినతి



ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మాణిక్యాలరావు

అనకాపల్లి: ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని, వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని, రోజురోజుకు కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందని, విశాఖ జిల్లా అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రిల్లో కిడ్నీ రోగులకు వైద్యం అందిస్తున్నారని, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధుల వైద్యుడు లేకపోవడం అన్యాయమని, జిల్లా ఆస్పత్రిలో ఒక్క వైద్యుడినైనా నియమించే విధంగా చర్యలు తీసుకోవాలనే డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి: గ్రామీణ రహదారులను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ గవరపేటవీధి శివాలయం నుంచి శంకర పంచాయతి బొజ్జన్న కొండ వరకూ రూ.70 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.30 లక్షలు, గ్రామ పంచాయతీ నిధుల నుంచి 20 లక్షలు, 15వ ఫైనాన్స్ నుంచి రూ.20 లక్షలతో రహదారి పనులు చేపట్టామన్నారు. 1400 మీటర్ల రహదారికి ప్రస్తుతం 850 మీటర్ల వరకూ పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, చదరం నాగేశ్వరరావు, వడ్డాది భారతి అశోక్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పీడీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో ధర పెరిగిన టమాటా

కశింకోట: ఇక్కడి వారపు సంతలో గురువారం టమాటా ధర కిలోకి రూ.పది పెరిగింది. గత వారం వరకు రూ.20 అమ్మిన టమాటా ఈ వారం రూ.30 అయింది. ఇక ఎప్పటిలాగే బంగాళాదుంప, క్యాబేజీ రూ.30 ఉల్లిపాయ, దొండకాయ, బెండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, గోరు చిక్కుడు రూ.60, క్యాప్సికం, పాదు చిక్కుడు రూ.80, బీరకాయ రూ.90కి విక్రయాలు సాగాయి.

బోసిపోయిన వారపు సంత



సూర్యతాపంతో బోసిపోయిన వారపు సంత

కశింకోట: వారపు సంత వేసవి ప్రారంభంలోనే సూర్య తాపంతో బోసిపోయింది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో అటు కొనుగోలుదారులు రాకపోగా, వ్యాపారులు దుకాణాలు విడిచి పక్కనున్న నీడలో సేద దీరారు. దీంతో సంత ప్రాంతం బోసిపోయింది. ఎండ తీవ్రత తగ్గాక సాయంత్రం యథావిధిగా ప్రజలు వచ్చి కొనుగోలు చేయడంతో ముమ్మరంగా అమ్మకాలు సాగాయి. కూరగాయలు, ఆకు కూరలు, మసాలా సరకులు, వస్త్రాలు, చేపలు, దుంపలు వగైరా అమ్మకాలు జోరందుకున్నాయి.

రాయితీతో అదనపు లోడ్ క్రమబద్ధీకరణ

కశింకోట: గృహ వినియోగదారుల అదనపు విద్యుత్ లోడ్‌ను సగం రాయితీ అందించి క్రమబద్ధీకరించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గృహ విద్యుత్ వినియోగదారులు సాధారణంగా లైట్లు, ఫ్యాన్లు వినియోగించడానికి ఉపయోగించే విద్యుత్‌ను లెక్కకట్టి అనుమతించిన మేర విద్యుత్ కనెక్షన్ మొదట పొందుతారన్నారు. ఆ తర్వాత అవసరాలు పెరిగి ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వగైరా ఉపకరణాలను వినియోగిస్తారన్నారు. దీనివల్ల అనుమతి పొందిన దాని కంటే అదనపు లోడ్‌తో విద్యుత్ వినియోగించడం వల్ల తమ సిబ్బంది ఎంఏటీ కేసు నమోదు చేస్తారన్నారు. దీని దృష్ట్యా ప్రతి అదనపు కిలోవాట్ వినియోగానికి సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ ఛార్జీలు రూ.2 వేలు, దరఖాస్తు రుసుం రూ.50 వంతున చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే ఈ ఏడాది జూన్ నెలాఖరులోగా అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకుని ఛార్జీ చెల్లిస్తే దానిలో సగం రాయితీ లభిస్తుందన్నారు. ఇందుకోసం సమీపంలోని మీ-సేవ కేంద్రం గాని, సచివాలయాన్ని గాని, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్లో గాని దరఖాస్తు చేసుకుని ఛార్జీ చెల్లించి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. సందేహాలకు 1912 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.

చెత్త సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం



మర్రిపాలెం చెత్త సంపద కేంద్రంలో వానపాములు విడుదల చేస్తున్న సిబ్బంది

నాతవరం: చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాల నిర్వహణతో పంచాయతీలకు అదాయం వస్తుందని పంచాయతీ విస్తరణాధికారి మూర్తి తెలిపారు. మర్రిపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రంలో గురువారం ఆయన వానపాములు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో కేంద్రాలు నిర్వహణ విధిగా చేయాలన్నారు. కేంద్రాల్లో తయారు చేసిన సేంద్రియ ఎరువులు విక్రయించడంతో పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. దీంతోపాటు ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రతి ఇంటి నుంచి వీధుల్లో తడి, పొడి చెత్త సేకరించడం ద్వారా రోగాలు రాకుండా కాపడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలి



వేణుగోపాల స్వామిని దర్శించుకుంటున్న మలసాల కుమార్‌రాజా తదితరులు

అనకాపల్లి: ప్రశాంత వాతావరణంలో గ్రామదేవతల పండగలు, ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా అన్నారు. మండలంలో తుమ్మపాలలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శ్రీ రమ సహితా వేంకటేశ్వరస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పడాల గణపతిరావు, పార్టీ నేతలు పన్నీరు వెంకటలక్ష్మి కొండలరావు, వడ్డాది అశోక్ భారతి, ఎరుబండి సత్యనారాయణ, కనుబుడ్డి శంకరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

అప్పారావు సేవలు అభినందనీయం



అప్పారావును సత్కరిస్తున్న మాజీ ఎంపీ వెంకట సత్యవతి

అనకాపల్లి టౌన్: జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసి, వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న అప్పారావు సేవలు అభినందనీయమని మాజీ ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి పేర్కొన్నారు. గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో జరిగిన జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. వృద్ధుల పట్ల సమాజం చిన్న చూపు చూస్తున్న తరుణంలో సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల విశ్వేశ్వరరావు, విల్లూరి రాము, ఎంఎస్ఎస్ అప్పారావు, కొణతాల త్రినాధరావు, బొడ్డేడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి రాట మహోత్సవం



రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని తాకాశి వీధి నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా గురువారం రాట మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తాకాశి కన్నబాబు మాట్లాడుతూ పుట్టలో స్వయంభూగా వెలసిన చరిత్ర ఇక్కడి నూకాంబిక అమ్మవారిదని తెలిపారు. ముందుగా వినాయక పూజ చేసి, రాటకు పసుపు రాసి ఆలయం ముందు నిలబెట్టారు. ఆలయ ఈవో రాజ సులోచన, తాకాశి కొండలరావు, తాకాశి సూర్యారావు, బేతి ఈశ్వరరావు, గంగుపోవు మహేష్ దొర, తాకాశి సత్యం దొర, తాకాశి నాగేష్, తాకాశి విశ్వేశ్వరావు, అదట రమణబాబు, పలక చంటి, దొండ రామారావు, తాకాశి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి దిగుబడికి సస్యరక్షణ చర్యలు

తుమ్మపాల: జిల్లాలో మామిడిపంట ప్రస్తుతం పిందె దశల్లో ఉందని, ఈ దశలో శాస్త్రవేత్తలు సూచించిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి పూత విచ్చుకున్నప్పటి నుంచి తేలికపాటి తడులతో ప్రారంభించి నీటిని ఇవ్వాలన్నారు. పిందె కట్టిన దశలో రెండవ దఫా సిఫారసు చేసిన ఎరువులను వేసుకోవాలన్నారు. తేనెమంచు పురుగు నివారణకు బుప్రోఫిజిన్ 1.5 ఎంఎల్ 1 లీటర్ నీటికి, ఆసిఫెట్ కలిపి 1 ఎంఎల్, డైనోటేఫ్యురాన్ 0.2 ఎంఎల్ ఒక లీటర్ నీటితో పాటు వేపనూనె 3 ఎంఎల్ ఒక లీటర్ జిగురు 0.5 ఎంఎల్ ఒక లీటర్‌కు కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తామర పురుగు నివారణకు, నీలం రంగు జిగురు అట్టలు చెట్టు మార్చి చెట్టుకు, ఒకటి చొప్పున పెట్టుకోవడం, పాదులో ఫాలిడాల్, క్లోరోపైరిఫాస్, వేప పిండి వేయాలన్నారు. నాణ్యమైన పండ్ల దిగుబడికి కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పండ్ల కవర్లను తొడగాలని తెలిపారు.

తప్పుడు కేసులు పెడితే సహించేది లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్

కశింకోట: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదని, రోడ్డు ఎక్కి ఉద్యమాలు చేయాల్సి వస్తుందని పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ హెచ్చరించారు. పరవాడపాలెంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు గొంతిన శివపై అధికార పక్ష ప్రత్యర్థులు వరుసగా పెడుతున్న తప్పుడు కేసులపై విషయమై గురువారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎస్‌ఐ మనోజ్‌కుమార్‌తో చర్చించారు. అనంతరం పోలీస్ స్టేషన్ బయట మాట్లాడుతూ కేవలం కక్ష సాధింపు, రాజకీయ వేధింపులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. అన్యాయంగా వ్యవహరిస్తే వైఎస్సార్ పార్టీ ఆందోళనలు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, జి. భీమవరం సర్పంచ్ హనుమంత్ వెంకట్, అచ్చెర్ల సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, పేరంటాలపాలెం ఉప సర్పంచ్ వజ్రం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సమ్మి గణేష్, ఒమ్మి గంగునాయుడు, కలిగెట్ల నాయుడు, ఇందల ముసిలినాయుడు, చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఓపెన్ హౌస్‌కు చక్కటి స్పందన



పోలీసుల విధుల గురించి వివరిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

కశింకోట: స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు పోలీసు స్టేషన్‌లో అందించే సేవలు, మహిళా చట్టాలు, వారి భద్రతకు సంబంధించిన అంశాల గురించి ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపకరించే హెల్ప్‌లైన్ నంబర్లు 100,112, 181, 1098 గురించి తెలిపారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌సీ సూర్యారావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

అనకాపల్లి టౌన్: గొలుగొండ మండలం కె. ఎల్లవరం పంచాయతీ డొంకాడ గ్రామానికి రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు గురువారం కలెక్టర్ విజయకృష్ణన్‌కు లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కోటి రూపాయలు విడుదల చేసినా పనులు ప్రారంభించలేదని విమర్శించారు. గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో గర్భిణులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే రోడ్డు సదుపాయం కల్పించాలని కోరారు.

రైల్వే ప్లాట్‌ఫారంపై గుర్తు తెలియని మృతదేహం



అనకాపల్లి టౌన్: అనకాపల్లి రైల్వే స్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై సుమారు 35 సంవత్సరాల వ్యక్తి మృతి చెందినట్లు విశాఖపట్నం జీఆర్‌పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి గురువారం తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలో భద్రపరిచామని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవన్నారు. మృతుడు బ్రౌన్ కలర్ టీషర్ట్, బ్లాక్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మరిన్ని వివరాలకు 7382058996 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విజయం సాధించిన విద్యార్థులతో ఎస్‌ఐ యమున

అనకాపల్లి టౌన్: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని దిశ ఎస్‌ఐ బి. యమున అన్నారు. గవరపాలెం గరల్స్ హైస్కూల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పదవ తరగతి నమూనా పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో పరీక్షలు ఒక భాగమని, ఆందోళనతో చదవాల్సిన అవసరం లేదని సూచించారు. విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం, జిల్లా అధ్యక్షుడు ఎం. బాలాజీ, డివిజన్ కార్యదర్శి ఎం. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.